ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శనివారం | 23 మే, 2026 | పేజీలు : 08

## ధాన్యం కొనుగోలుకు అధికారుల చర్యలు

### రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం:** ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు. శుక్రవారం కాళేశ్వరంలో మెగా విశ్రాంతి భవనంలో ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్ తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి తక్షణ చెల్లింపులు జరిగేలా ఆన్లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తగిన సదుపాయాలు కల్పించి పారదర్శకంగా వ్యవహరించాలని, ఆర్డీవో పర్యవేక్షణలో కొనుగోళ్లు జరగాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాటారం ఆర్డీఓ రవీందర్ పాల్గొన్నారు.

# పుష్కర స్నానం.. పునీతం



### సరస్వతి మాత నమోహో.. స్తుతి
### ఆధ్యాత్మిక కేంద్రంగా త్రివేణి సంగమ తీరం
### 2వ రోజు కొనసాగుతున్న అంత్య పుష్కరాలు



**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాల సందర్భంగా త్రివేణి సంగమ తీరంలో పుణ్య స్నానాలు ఆచరించే మహిళా భక్తులు ఆధ్యాత్మిక పునీతంలో మునిగిపోతున్నారు. తీరం వద్ద ఇసుకతో సైకత (శివ) లింగాలు ఏర్పాటు చేసి వాటికి పసుపు, కుంకుమ, పుష్పాలు, కొబ్బరి కాయలు, నైవేద్యం సమర్పించి పూజలు చేస్తుండగా, నదిలో పుణ్య స్నానాలు ఆచరిస్తూ తాము కోరినకోర్కెలు తీర్చి తమ కుటుంబాలకు సుఖ సంతోషాలు ప్రసాదించాలని భక్తులు సరస్వతి నదీ మాతల్లికి రెండు చేతులెత్తి మొక్కులు చెల్లించుకుంటున్నారు. మరి కొందరు మహిళా భక్తులు తమకు సౌభాగ్యంతో నిండు నూరేళ్ళ ఆయుస్సు కలిగించాలని నదీమాతల్లిని వేడుకుని మొంటెలతో బ్రాహ్మణ ముత్తైదువలకు వాయనాలు సమర్పిస్తున్నారు. తీరంలో పుణ్య స్నానాలు ఆచరించిన మరి కొంత మంది భక్తులు పవిత్ర జలాలతో సూర్య భగవానుడికి మూడు సార్లు ఆర్ఘ్య ప్రధానం సమర్పించి చేతులు జోడించి సూర్య నమస్కారం చేస్తున్నారు. తీరం వద్ద మరణించిన తమ తమ పితృదేవతలకు పిండ ప్రధానాలు సమర్పించి నదీమాతను వేడుకుంటున్నారు.





### సమాచార శాఖ ఆధ్వర్యంలో నవరత్నమాల హారతి ప్రత్యక్ష ప్రసారం:- కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి అంత్య పుష్కరాల్లో భాగంగా ప్రతి రోజు కాశి పండితుల చేతుల మీదుగా నిర్వహిస్తున్న సరస్వతి నవరత్న మాలా హారతి ప్రతి రోజు రాత్రి 7.30 గంటల నుండి దేశ, విదేశాల్లో నివసిస్తున్న భక్తులు వీక్షించడానికి వీలుగా సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సరస్వతి నవరత్న మాలా హారతి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ రోజు రాత్రి 7.30 గంటల నుండి నిర్వహించే సరస్వతి నవరత్న మాలా హారతి కాశీలో అత్యంత ప్రజాదరణ పొందిన గంగా హారతినిచ్చే పండితుల ద్వారా ఇచ్చేలా ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.దాదాపు 45 నిమిషాల పాటు సాగే సరస్వతి నవరత్నమాల హారతిలో తొమ్మిది ప్రత్యేక హారతులను కాశీ పండితులు ఇస్తున్నారు.సరస్వతి నవరత్నమాల స్తోత్రం ద్వారా తొమ్మిది హారతుల్లో 1) ఓంకార హారతి. పాపాలు పోగొట్టి దీపంలా నిలబెడుతుంది. 2) నాగ హారతి. సర్ప దోషాన్ని పోగొట్టి సంతానాన్ని, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. 3) పంచ హారతి, దీర్ఘాయుష్షును ఇస్తుంది. 4)సూర్య హారతి. రోగాలను మాపి యోగశక్తిని, ఆరోగ్యాన్ని ఇస్తుంది. 5) చంద్ర హారతి. పాడి పంటలను, దాంపత్య సౌఖ్యాన్ని, మన: శాంతినిస్తుంది. 6)నంది హారతి. ధర్మ బుద్ధిని, కీర్తిని, భక్తిని, యుక్తిని, శక్తిని, విద్యా బుద్ధినిస్తుంది. 7) సింహ హారతి. ధైర్య సాహసాన్ని, నాయకత్వాన్ని, విజయాన్నిస్తుంది. 8) కుంభ హారతి. సంపదను, సంతుష్టిని, పుష్టిని కోటి సుఖాలను అందిస్తుంది. 9)నక్షత్ర హారతి. నిర్మలమైన మనస్సును, సౌందర్యాన్ని, కీర్తిని అందిస్తుంది.



### అర్బన్ చాలెంజ్ ఫండ్‌లో
## వరంగల్‌కు రూ.4,674 కోట్లు

### కేంద్రం ఆమోదంతో నగరాభివృద్ధికి భారీ ఊతం
### ఎంపి డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్:** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అర్బన్ చాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) కింద వరంగల్ నగరానికి రూ.4,674 కోట్ల భారీ నిధులు మంజూరైనట్లు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తెలిపారు. తెలంగాణకు ఆమోదమైన మూడు ప్రాజెక్టులకు మొత్తం రూ.5,681 కోట్లు కేటాయించగా, అందులో అత్యధిక భాగం వరంగల్‌కే దక్కడం రాష్ట్ర ప్రభుత్వ కృషికి నిదర్శనమని ఎంపీ పేర్కొన్నారు. ఈ నిధులతో నగరంలో డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ, వరద నివారణ పనులు, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులు అమల్లోకి వస్తే వరంగల్ నగర రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, ప్రజలకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం వద్ద సమర్థవంతంగా ప్రతిపాదనలు ఉంచి ఈ నిధులు సాధించిందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు. పట్టణాభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి ఫలితంగానే వరంగల్‌కు ఈ స్థాయి నిధులు లభించడం జరిగిందన్నారు. ప్రాజెక్టుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి 50 శాతం నిధులు సమకూర్చనున్నాయని, మిగతా భాగం హడ్కో రుణాల ద్వారా సమీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. పనులు పూర్తయిన తర్వాత వరంగల్ ఆధునిక నగరంగా రూపుదిద్దుకోనుందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.

### ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికతో
## ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం

**ప్రజాపక్షం/హనుమకొండ:** ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర గీతం "జయ జయహే తెలంగాణ"తో ప్రారంభమైంది. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక ద్వారా వివిధ శాఖలు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేలా జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2న పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఇటీవల నిర్వహించిన మెగా రైతు మేళా ఎంతో ఉపయోగకరంగా నిలిచిందన్నారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంటల మార్పిడి చేపట్టాలని, నానో యూరియా వినియోగం పెంచాలని సూచించారు.రసాయనిక పురుగుమందుల అధిక వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ సాగు వైపు రైతులు మళ్లాలని పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.గర్భిణీలు, చిన్నారుల పోషకాహారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. గంజాయి వంటి మత్తు పదార్థాల నియంత్రణకు సమాజం మొత్తం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. యువత క్రీడల్లో రాణించాలని, రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యాసంస్థలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ, డీఆర్డీఓ, విద్యాశాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, యువజన క్రీడా శాఖ, ఉద్యాన శాఖ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ నిర్మల, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

ప్రజాపక్షం/తొర్రూరు : కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న వరి ధాన్యం, మక్కలను వెంటనే కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతూ తహశీల్దార్‌కు బీజేపీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం డివిజన్ కేంద్రంలో బీజేపీ తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేశ్, తొర్రూరు రూరల్ మండల అధ్యక్షుడు గట్టు రాంబాబుల ఆధ్వర్యంలో పంటల కొనుగోలులో రైతులు పడుతున్న ఇబ్బందులపై తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి రెండు నెలలు అవుతున్నా పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకపోవడం సరికాదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తీవ్రంగా జాప్యం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ కౌన్సిలర్ కొలుపుల శంకర్, జిల్లా నాయకులు, అమ్మాపురం గ్రామ ఉప సర్పంచ్ సిరిపాటి విశాల్, మంగళపల్లి యాకయ్య, మండల ప్రధాన కార్యదర్శులు నడిగడ్డ సందీప్, గుగులోతు భాస్కర్‌నాయక్, గంధం రాజు, నూకల నవీన్, గుండా సురేష్, కొండపల్లి శ్రీనివాస్, తాడిశెట్టి నవీన్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## జలగం సంపత్‌రావు కుటుంబ వేడుకలో మాజీ ఎంపి కవిత ఎమ్మెల్యే శంకర్ నాయక్

ప్రజాపక్షం/గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జలగం సంపత్ రావు మనవరాలి నూతన వస్త్రాలంకరణ వేడుక హన్మకొండలో ఘనంగా నిర్వహించారు.నగరంలోని ఎన్‌వీ కన్వెన్షన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత మహబూబాబాద్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే భానోత్ శంకర్ నాయక్ హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈసందర్భంగా కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడిన కవిత శంకర్ నాయక్ చిన్నారి భవిష్యత్తు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో నర్సింహానాయక్ అర్రె వీరన్న నూకల సరేందర్ కటార్ సింగ్ బెజ్జం రమేష్ రెడ్యా మండల కుమార్ నూకల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు కృషి

ప్రజాపక్షం/జనగామ టౌన్: ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీసీ అధ్యక్షులు లకావత్ ధన్వంతి లక్ష్మి నారాయణ అన్నారు. శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో డీసీసీ అధ్యక్షులు, కలెక్టర్ హాజరై మాట్లాడుతూ ముఖ్యమైన పథకాలలో రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, సన్నరకం వరి బోనస్ వంటి సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జేసి, మున్సిపల్ చైర్ పర్సన్ కడకంచి బాలమణి, అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## లీడ్ ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకం




ప్రజాపక్షం/నర్సంపేట: సమాజ సేవ, విద్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో గత రెండు దశాబ్దాలుగా లీడ్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ఎనలేనివని, యువతకి ఎంతో స్ఫూర్తిదాయకమని వరంగల్ ఎంపి కడియం కావ్య అన్నారు. హనుమకొండలో విద్యా ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాసుల రవికుమార్‌కు ఎంపి కడియం కావ్య చేతుల మీదుగా సేవా పురస్కారం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపి కావ్య మాట్లాడుతూ యువతలో సేవా భావం పెంపొందించేదుకు, విద్యార్థుల్లో సామాజిక చైతన్యం కలిగించేదుకు లీడ్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సమాజ మార్పుకు విద్యతో పాటు సేవా దృక్పథం కూడా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో విద్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిల్లా మహేందర్, ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావు, ప్రముఖ రచయిత్రి నెల్లుట్ల రమాదేవి, గట్టు రాధిక మోహన్, మాధవి, అన్నాల శ్రీనివాస్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యరెడ్డి వర్మ సేవలు స్ఫూర్తిదాయకం



ప్రజాపక్షం/భూపాలపల్లి : అణగారిన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన దళిత ఉద్యమ నేత గొప్ప సంఘసంస్కర్త భాగ్య వర్మ రెడ్డి సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కొనియాడారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని ఐడీఓసీ సమావేశ మందిరంలో ఎస్సీ కులాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని, దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని కొనియాడారు. విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల సంక్షేమం, అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్, ఎస్సీ కులాల అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, ఆర్డిపి మెంబర్ సుంకరి రామచంద్రయ్య, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వంశీ కృష్ణపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



ప్రజాపక్షం/ములుగు: డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, అతని కుమారుడిపై అసత్య ప్రచారాలు చేసిన మహా న్యూస్ ఛానెల్, ఎండి వంశీ కృష్ణపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ములుగు నియోజకవర్గ బిఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా ఎస్‌పిని కలిసి మహాన్యూస్ ఛానల్ ఎండిపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా ఛానల్‌లో ప్రసారమవుతున్న స్క్రోలింగ్‌లు సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని, డాక్టర్ ప్రవీణ్ కుమార్ పరువు ప్రతిష్టలను రాజకీయంగా దెబ్బతీయాలనే ఉద్దేశ్యంతో కుట్రపూరితంగా ఈ ప్రచారం జరుగుతోందని నాయకులు ఆరోపించారు. అవమానకర ప్రసారాలను వెంటనే నిలిపివేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ములుగు జిల్లా నాయకులు బొట్ల ప్రశాంత్ స్వేరో, అఖిల్ స్వేరో, శ్రవణ్ స్వేరో, బండారి శ్యామ్ బాబు, పోరిక వంశీ, భూక్య కళ్యాణ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## తరుగు పేరుతో నిలువు దోపిడీ



ప్రజాపక్షం/ములుగు: అకాల వర్షానికి ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారని, తక్షణమే ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయాలని మాజీ జడ్పి చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, మాజీ రెడ్‌కో చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు మహబూబాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వై సతీష్ రెడ్డి డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం కొనాలని, రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందని, కర్షకులపై సర్కార్‌కు కనికరం లేదని అన్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రం వద్ద కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. వాటితో పాటు ములుగు జిల్లాలో ఉన్న అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రంలో ధాన్యం, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పదిహేను రోజుల నుండి ధాన్యం కొనుగోలు చేయడం లేదని, అకాల వర్షానికి ధాన్యం తడిచి రైతులు నష్టపోతున్నారని, తక్షణమే ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయాలని బడే నాగజ్యోతి, మాజీ రెడ్‌కో చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు మహబూబాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వై సతీష్ రెడ్డిలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లింగాల రమణారెడ్డి, రమణారెడ్డి, రమేష్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ కుమార్, మల్కా రమేష్, బిక్షపతి, జగదీష్, మాజీ సర్పంచ్‌లు యాదగిరి, జ్ఞానేందర్, అశోక్, మాజీ ఎంపిటిసి వీరమల్లు, పార్టీ సీనియర్ నాయకులు మల్లేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా ఫిర్యాదుతో కార్మికులకు న్యాయం



ప్రజాపక్షం/ములుగు: ములుగు జిల్లా బందారుపల్లి గ్రామం ఇటుక బట్టీల తయారీ వద్ద కొంత కాలంగా పనిచేస్తున్న కార్మికులు తమ యజమాని వేధిస్తున్నారంటూ సోషల్ మీడియా ద్వారా అందిన ఫిర్యాదుపై ములుగు జిల్లా ఎస్‌పి కేకన్ సుధీర్ రామ్‌నాథ్ ఐపిఎస్ వెంటనే స్పందించి సంబంధిత ఇటుక బట్టీ పని ప్రదేశానికి స్వయంగా చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. బందారుపల్లి ప్రాంతంలోని కెఎంకె బ్రిక్స్ వద్ద పనిచేస్తున్న కార్మికులు, తమ కుటుంబాలను అక్రమంగా నిర్బంధించి తమ సొంత రాష్ట్రానికి వెళ్ళనీయకుండా చేస్తున్నాడనే ఫిర్యాదు అందగా, అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని ఎస్‌పి అక్కడి కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఇటుక బట్టీల యజమానితో మాట్లాడగా వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగించలేదని వారిని వారి స్వంత రాష్ట్రానికి వెళ్లేలా వాహనాన్ని సైతం పెట్టానని ఎస్‌పికి విన్నవించారు. కార్మికులకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా తమ స్వగ్రామాలకు సురక్షితంగా వెళ్లేందుకు ఎస్‌పి పూర్తి భరోసా కల్పించారు. ఎస్‌పితో ములుగు డిఎస్‌పి నలువాల రవీందర్, ములుగు ఎస్ఐ ఉపేందర్‌లు ఉన్నారు.

## చలో హైదరాబాద్ మహాధర్నా

ప్రజాపక్షం/తొర్రూరు: హైదరాబాద్‌లోని లేబర్ కార్యాలయం ముందు ఈ నెల 25న భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) తొర్రూరు ఏరియా కమిటీ కార్యదర్శి ఎండి.షరీఫ్, భవన నిర్మాణ కార్మిక సంఘం యూనియన్ డివిజన్ అధ్యక్షుడు బైరి శ్రీనివాసులు అన్నారు. డివిజన్ కేంద్రంలో శుక్రవారం పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు, పేయింటర్స్ కార్మికులు తమ నైపుణ్యాన్ని పెంచుకోవడం వల్ల తమ వృత్తికి గౌరవం పెరుగుతుందని జీవనోపాధి కూడా దొరుకుతుందని అన్నారు. భవన నిర్మాణ కార్మికులు అతి ప్రమాదమైన పని కావున కార్మికులకు పారితోషకాలతో పాటు ఇన్సూరెన్స్ సౌకర్యాలను కంపెనీలను ఏర్పాటు చేయాలన్నారు. టీయూసీఐ కార్మిక సంఘం కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని, ఆ పోరాటంలో భాగంగా 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు అమలైందని ఆ సంక్షేమ బోర్డు ద్వారానే అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం సహజ మరణానికి ఇచ్చిన రెండు లక్షల ఇన్సూరెన్స్ స్థానంలో రూ.ఐదు లక్షలు ఇవ్వాలని, ప్రసూతి సహాయాన్ని రూ.యాభై వేలకు పెంచాలని, పెళ్లి కానుక సహాయం రూ.లక్ష పెంచాలని, ప్రమాదాలు జరిగి వికలత్వం పొందితే రూ.పది లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వృత్తిని కొనసాగించడానికి వారి జీవనోపాధికి రూ.రెండు లక్షల రుణాలు ఎలాంటి షరతులు లేకుండా ఇవ్వాలని కోరారు. నిర్మాణ రంగ కార్మికులకు నెలకు రూ.తొమ్మిదివేలు పెన్షన్ ఇవ్వాలని, నిర్మాణ రంగ సంక్షేమ బోర్డు స్థానంలో ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఈ స్కీంను అప్పజెప్పిందని వాటిని రద్దు చేసి సంక్షేమ బోర్డు ద్వారానే పథకాన్ని కొనసాగించాలని అన్నారు. ఈ సమస్యల సాధన కోసం ఈ నెల 25న హైదరాబాద్‌లో మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఈ కార్యక్రమానికి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అన్నారం వినోద్, కృష్ణ, రాములు, రమేష్, శ్రీను, జగన్, వెంకన్న, ధర్మయ్య, వెంకన్న, బాలు, మహేందర్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపి విఓఎల సమ్మెకు శ్రీకారం

ప్రజాపక్షం/గూడూరు: గూడూరు మండలంలోని ఐకేపీ వీవోఏలు తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం ఆందోళనకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పృథ్వికి సమ్మె నోటీసును వీవోఏలు అందజేశారు.ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగ భద్రతతో పాటు వేతన సమస్యలను పరిష్కారం అయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో వసంతయూనియన్ మండల అధ్యక్షురాలు మళ్లీవేని శ్రీలత కార్యదర్శి కోలా యాకయ్య కోశాధికారి వేముల శారదతో పాటు పద్మ శారద భారతి సుజాత ఈశ్వరి వసంత సుగుణ రాములు కళ్యాణ్ రాజు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి లక్ష్యం

### సర్పంచ్ నర్సింగ రామకృష్ణ



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** గ్రామాన్ని అభివృద్ధి చేయడమే నా లక్ష్యం అని సర్పంచ్ నర్సింగ రామకృష్ణ అన్నారు. మండలంలోని నెల్లుట్ల గ్రామంలో, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 8 లక్షల రూపాయల వ్యాయామంతో మంజూరైన, పేర బోయిన యాదయ్య ఇంటి వద్ద నుండి, బైపాస్ రోడ్ వరకు, మట్టి రోడ్డు పనులను, సర్పంచ్ రామకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఉపసర్పంచ్ దామెర కావ్య ప్రభాకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్, వార్డ్ మెంబర్స్, కొయ్యడ అనిల్, వేల్పుల శోభారాణి, సందీప్, భరత్, ఎస్సీ సెల్ అధ్యక్షులు, రమేష్, ఆనంద్, యాదగిరి, ఉపేందర్, మధు, తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివి పాఠశాల, జూనియర్ కళాశాలలో అడ్మిషన్‌లకు ఆహ్వానం

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** మండల పరిధిలోని మిట్టపల్లి,ఎల్లుపల్లిలోని కేజీబీవీ పాఠశాలో,జూనియర్ కళాశాలలో 6వ తరగతికి 20 సీట్లు,7వ తరగతిలో 08 సీట్లు,8వ తరగతిలో 07 సీట్లు,9వ తరగతిలో 08 సీట్లు అలాగే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపిహెచ్‌డబ్ల్యూలో 20 సీట్లు,సిఈసి గ్రూప్‌లో 30 సీట్లు కోసం విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి అర్పిత తెలిపారు.పూర్తి వివరాలకు సంప్రదించవలసిన నెం.9849895705 సంప్రదించాలని సూచించారు.

## కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** 2026–27 విద్యా సంవత్సరంలో కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సంబంధిత ధృవపత్రాలతో తెలంగాణ ఈ పాస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కావున అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. ఈనెల 20 నుంచి జూన్ 6వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు చేసుకోవాలన్నారు. ఎంపిక జాబితా జూన్ 10వ తేదీన విడుదల చేయడం జరుగుతుందన్నారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** నియోజకవర్గంలో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. జిల్లా ఐడిఓసి కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), జిల్లా పౌరసరఫరాల అధికారి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. రైతులు ధాన్యం విక్రయాల విషయంలో ఎటువంటి ఆలస్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ బ్యాగులు, తేమ కొలిచే యంత్రాలు, హమాలీలు, రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కేంద్రాల్లో పారదర్శ కంగా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, ఆర్టిఏ మెంబర్ సుంకరి రామచంద్రయ్య, జిల్లా రవాణా శాఖ అధికారి ఎండి సంధాని, భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ శాఖ చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి

### కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**ప్రజాపక్షం/హనుమకొండ:** జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆ శాఖ అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో వివిధ అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని మండలాల్లో పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న అంగన్వాడీ కేంద్రాల భవనాల పురోగతి, ఇతర అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ చివరి దశ నిర్మాణంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు , గ్రామ పంచాయతీ భవనాలు, వీవో భవనాలను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. టెండర్లు పూర్తికాని చోట త్వరగా ఆ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. చివరి దశలో ఉన్న వాటిని త్వరగా పూర్తి చేసి ప్రారంభించేలా సిద్ధం చేయాలన్నారు. భవన నిర్మాణ పనులన్నీ పురోగతిలో ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల కాంపౌండ్ వాల్స్, టాయిలెట్స్, ఇతర నిర్మాణ పనులన్నీ జూన్ 30లోగా పూర్తి చేయాలన్నారు.స్వచ్ఛ భారత్ మిషన్ లో భాగంగా ఇంకుడు గుంతలు నిర్మాణం చేసుకునేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ రాజ్ ఈఈ సైదుల్ రెడ్డి, డీఈలు శ్రీనివాస్ రావు,జయశంకర్, శిరీష, శ్రీనివాస్ రెడ్డి, వివిధ మండలాల పంచాయతీరాజ్ ఏఈలు పాల్గొన్నారు.

## ముత్తాపూర్‌లో బాలవికాస ఆదర్శ గ్రామ నిర్మాణంపై గ్రామసభ




**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** మండలంలోని ముత్తాపూర్ గ్రామంలో శుక్రవారం బాలవికాస ఆధ్వర్యంలో ఆదర్శ గ్రామ నిర్మాణం పై గ్రామ సభ నిర్వహించినట్లు సర్పంచ్ కుంజ స్వరూప తెలిపారు గ్రామానికి చెందిన 220మంది ప్రజలు నాయకులు తదితరులతో ఈ గ్రామసభ జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాల వికాస ఆదర్శ గ్రామ పథకం మేనేజర్ మంజుల సీనియర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వసంత మాట్లాడుతూ ఆదర్శ గ్రామం అంటే రోడ్లు భవనాలు నిర్మించుకోవడం కాదు వినూత్న కార్యక్రమాలను చేపడుతూ క్రమ శిక్షణతో గ్రామ ప్రజలందరూ కట్టు బాట్లు నియమాలు పద్ధతులు పెట్టుకుని వాటిని పాటిస్తూ ఊరంతా కలిసి ఒకే మాట ఒకే బాటలో ఐక్యముతో ఉంటే ఆదర్శ గ్రామంను సాధించుకోవచ్చని అభివృద్ధి గ్రామానికి ఆదర్శ గ్రామానికి తేడా మనకు అర్థం కావాలని డబ్బులుంటే అభివృద్ధి చేసుకోవచ్చు కానీ ఆదర్శ గ్రామమంటే ప్రజలందరూ కలిసి ఒకరికొకరు ఆలోచనలు అభిప్రాయాలు పంచుకుంటూ ఐక్యమతంతో గ్రామంలో ఉన్న వనరులను గుర్తించి వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం వల్ల గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కరించుకోవచ్చు ఈ సందర్భంగా ఎనిమిది కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది అనంతరం గ్రామ సర్పంచ్ కుంజా స్వరూప మాట్లాడుతూ మా గ్రామంలో బాల వికాస సంస్థ ద్వారా నిర్వహించే ప్రతి కార్యక్రమానికి గ్రామ పంచాయతీ నుండి పూర్తి సహకారం అందిస్తాము అన్నారు బాల వికాస ఆదర్శ గ్రామ నిర్మాణ పథకంలో మా గ్రామం ఎన్నుకున్నందుకు మాకు చాలా సంతోషంగా ఉంటుందన్నారు మా గ్రామంలో ఒక పండుగ వాతావరణం ఉందన్నారు గ్రామ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు స్వచ్ఛందంగా గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం తీసుకోవడానికి ముందుకొచ్చిన కమిటీ వాళ్లకు అభినందనలు తెలిపినారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అనేకమంది పాల్గొన్నారు.

## ఎత్తైన ప్రాంతాలకు శాశ్వత సాగునీరు అందించడమే లక్ష్యం

### ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** ఎత్తైన ప్రాంతాలకు శాశ్వత సాగునీరు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గండి రామారం పంప్ హౌస్‌వద్ద కొనసాగుతున్న దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ఫేజ్ 1 పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు త్వరితగతిన సాగునీరు అందించాలని ఆదేశించారు. తాను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలోనే అప్పటి సీఎం కేసీఆర్‌తో కలిసి తరిగొప్పుల లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.110కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించుకున్నామని తెలిపారు. తరిగొప్పుల మండలాన్ని సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో గండిరామారం రిజర్వాయర్ ఆధారంగా రూ.63.80 కోట్లతో లిఫ్ట్ 1 ఇరిగేషన్ పథకాన్ని చేపట్టామని పల్లా వివరించారు. తొలి దశలో 4 వేల ఎకరాలకు నీరు అందుతుందని, భవిష్యత్తులో మరో 10 వేల ఎకరాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. తరిగొప్పుల మండలానికి నీళ్ల తీసుకురావడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు జగన్మోహన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పద్మజ వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ జులాల్, నాయకులు ప్రభుదాస్, రమ సంపత్ రెడ్డి, సర్పంచ్ శ్రీను, సర్పంచ్‌ల ఫోరం నర్మెట అధ్యక్షులు అంజనేయులు, సర్పంచ్ రవి నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలు ఉన్నతస్థాయిలో అభివృద్ధి చెందాలి

### కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోతు సునీత వెంకన్న



**ప్రజాపక్షం/కేసముద్రం:** అన్ని రంగాలలో మహిళలు ఉన్నతస్థాయిలో అభివృద్ధి చెందాలని కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోతు సునీత వెంకన్న అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పిఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ అమలుపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ స్నేహ శబరీష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న సమావేశంలో కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోతు సునీత వెంకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ మహిళ సంఘ సభ్యురాళ్లు మహిళా సంఘాలు నుండి రుణాలు పొంది సొంత వ్యాపారం ప్రారంభించిన వారు వాటికి సంబంధించిన స్టాల్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో కేసముద్రం విలేజ్ గ్రామానికి చెందిన మహిళా సంఘ సభ్యురాలు మేడి లక్ష్మి స్వచ్ఛమైన గానుగ నూనె, వివిధ రకాల నూనెలను ప్రదర్శించగా కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోతు సునీత వెంకన్న డిఎంసి విజయతో కలిసి సందర్శించి అభినందించారు.

## సర్ ప్రక్రియలో కీలకంగా వ్యవహరించాలి : ఎర్రబెల్లి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** ప్రభుత్వం చేపట్టే సర్ ప్రక్రియలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కీలకంగా వ్యవహరించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తలు, గ్రామాల ఇంచార్జీలతో నిర్వహించిన సమావేశానికి ఎర్రబెల్లి హాజరై మాట్లాడుతూ నియోజకవర్గంలో కనివినీ ఎరుగని రీతిలో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. సర్ ప్రక్రియలో భాగంగా దొంగ ఓట్లను ఏరివేసేందుకు ప్రతి కార్యకర్త కీలకంగా వ్యవహరించాలని సూచించారు. రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు చేయించి వచ్చే ఎన్నికలలో ప్రతి గ్రామంలో గులాబీ జెండాలు ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఇంచార్జి సుధీర్ కుమార్, నాయకులు నవీన్, గాంధీ నాయక్, అశోక్ రెడ్డి, ఎల్లయ్య, వేణు, సురేష్, పాపారావు, ప్రదీప్, కళింగరావు, గణేష్, పాల్గొన్నారు.

## కనీస వేతనం పెంపుదల కార్మికులకు వరం

### ఐఎన్‌టియుసి జనరల్ సెక్రటరీ పసునూటి రాజేందర్

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పరిశ్రమలు, సంస్థలు సేవారంగాలలో పనిచేస్తున్న సుమారు 1,11,56,204 మంది కార్మికులకు కనీస వేతనాలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షనీయమని ఐఎన్‌టియుసి జనరల్ సెక్రటరీ పసునూటి రాజేందర్ అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని ఐఎన్‌టియుసి కార్యాలయంలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బి మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత దాదాపు 12 సంవత్సరాలుగా రాష్ట్రంలో కనీస వేతనాల సమగ్ర సవరణ జరగకపోవడంతో కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.\రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారులను పలుమార్లు కలిసి కనీస వేతనాల పెంపు అవసరాన్ని వివరించడంతో పాటు, కార్మికులకు న్యాయం జరిగేలా సమగ్ర నివేదికలు, సూచనలు సమర్పించినట్లు తెలిపారు ఈ సమావేశంలో ఐఎన్‌టియుసి సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ జోగ బుచ్చయ్య, సెక్రటరీ రాజేష్ టాకూర్, బ్రాంచ్ సెక్రటరీస్ హుస్సేన్, కె.శంకర్, రవి కిరణ్, పిట్ సెక్రటరీ లు సోత్కు సమ్మయ్య, పొనగంటి కృష్ణ, గట్టు రాజు, లక్ష్మీ నారాయణ, కూతురు కుమారస్వామి, సంగ శ్రీనివాస్, చిన్న మల్లయ్య సంతోష్, అశోక్ నవీన్ కుమార్, అప్పం రాములు, మల్లేష్, బండ బాబు, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎండ తీవ్రతకు ప్రజలు అప్రమత్తంగా ఉండండి

ప్రజాపక్షం/శివ్వంపేట : శివ్వంపేట మండల ప్రజలందరు ఎండ తీవ్రతకు అప్రమత్తం గా ఉండాలని తాజా మాజీ జడ్పీటీసీ పబ్బమహేష్‌గుప్తా అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో ప్రయాణాలు మానుకోవాలని, నలుపురంగు దుస్తులు ధరించవద్దని, కాఫీ, టీ అధిక వేడి సమయంలో తీసుకోవద్దన్నారు. నీటిని ఎక్కువగా తాగాలని, వడదెబ్బకు గురైతే వెంటనే ఆసుపత్రిలో చూపించుకోవాలన్నారు. అత్యవసరమైతే తప్పా బయటకు రాకూడదన్నారు.

## ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వ్యక్తి మృతి

ప్రజాపక్షం/పాపన్నపేట: ఏడుపాయల చెక్ డ్యాం సమీపంలో ప్రమాదవశాత్తూ నీట మునిగి ఓ వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన ప్రకారం వివరాలు సంగారెడ్డి జిల్లాలోని నవాబ్ పేట గ్రామానికి చెందిన కంకరి నాగరాజు (31)కు అపుడపుడు ఫిట్స్ వస్తుంది. అమ్మవారి దర్శనం కోసం శుక్రవారం ఉదయం ఏడుపాయలకు వచ్చాడు. ఏడుపాయల చెక్ డ్యాం సమీపంలో స్నానం చేయడానికి నీటిలోకి దిగాడు. నీటిలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ నీట మునిగాడు.కాసేపటికి అటుగా వెళ్లిన స్థానికులు ఒడ్డుపై ఉన్న చెప్పులు, బట్టలు, ఫోన్ ను గుర్తించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి తండ్రి మానయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## కార్మికుల వేతనాలు పెంచినందుకు సిఎం కు పాలాభిషేకం



ప్రజాపక్షం/పాపన్నపేట:తెలంగాణలోని కార్మికులకు కనీస వేతనాలను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన పాపన్నపేట లోని నేతాజీ చౌరస్తాలో ఒక కోటి 11 లక్షల మంది కార్మికులకు కనీస అవసరాలను పట్ల కాంగ్రెస్ పార్టీ నా యకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు కార్మికులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం గొప్ప నిర్ణయం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటేశం, సర్పంచులు శ్రీధర్, శ్రీశైలం, నాయకులు కలీం, నారా గౌడ్ పాల్గొన్నారు.

## కార్మికులకు వేతనాల పెంపు...ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



ప్రజాపక్షం/రామాయంపేట: తెలంగాణ రాష్ట్రంలోని కోటి 11లక్షల మంది కార్మికులకు కనీస వేతనాలు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుల చిత్రపటాలకు శుక్రవారం మున్సిపల్ కార్మికులు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా 7వ వార్డు కౌన్సిలర్ గజవాడ నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే నిజమైన ప్రజా ప్రభుత్వమని కొనియాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటుంటున్నారని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, రైతుల వద్ద ఉన్న చివరి ధాన్యపు గింజ వరకు కొనుగోలు చేస్తామని అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈకార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, కౌన్సిలర్లు దేవుని రంజిత్, గుగ్లోత్ రవినాయక్, కోఆప్షన్ సభ్యులు దేమె యాదగిరి, గౌస్, డీసీసీ కార్యదర్శి పోచమ్మల గణేష్, మండల పార్టీ అధ్యక్షులు బండారి మహేందర్‌రెడ్డి, నాయకులు చింతల స్వామి, డాకి స్వామి, దేవుని రాజు, భూమ రమేష్, విప్లవ్‌కుమార్, ఎనిశెట్టి అశోక్‌గుప్తా, తొంటవాలి యాదగిరి, పచ్చంటి రాము, కుమార్‌సాగర్, బైరం శంకర్, ఒగ్గి స్వామి, ,చింతల నరేష్, మంగలి పవన్, విరాట్, పోచమ్మల భాను, అక్కల నరేందర్, సాయితేజ, సుదీర్‌గౌడ్, మోబిన్, అస్లాం, దారం సంతోష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సిసి కెమెరాలదే ప్రధాన పాత్ర

### రేగోడ్ పోలీస్ స్టేషన్ అకస్మాత్తుగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పి శ్రీనివాస్ రావు



ప్రజాపక్షం/రేగోడు: పోలీస్ స్టేషన్ మెదక్ జిల్లా ఎస్పి శ్రీనివాస్ రావు శుక్రవారం అకస్మాత్తుగా తనిఖీ నిర్వహించారు అనంతరం రికార్డులు పరిశీలించారు వారు మాట్లాడుతూ పెండింగ్ కేసులు పరిష్కరించాలని అన్నారు ప్రతి రోజు వాహనాలు తనిఖీలు నిర్వహించాలని పోలీస్‌లు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని అన్నారు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు తప్పనిసరి హెల్మెట్ ధరించి ఉండాలని సూచించారు శాంతిభద్రతల పై పరీక్షణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు మద్యం సేవించి వాహనాలు నడిపితే వెహికల్ సీజ్ చేస్తామని అన్నారు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అని సూచించారు ఈ కార్యక్రమంలో మెదక్ డిఎస్పి ప్రసన్న కుమార్ సిఐలు రాజశేఖర్ రెడ్డి సందీప్ రెడ్డి రేణుక రేగోడ్ ఎస్సై పోచయ్య సిబ్బంది తదితరులు ఉన్నారు

## మున్సిపల్ అకౌంటెంట్ కార్యాలయానికి తాళం వేసే అధికారం మీకెక్కడిది..?

ప్రజాపక్షం/రామాయంపేట: మున్సిపల్ కార్యాలయంలో అధికారులు అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తూ మున్సిపల్ పాలకవర్గం అకౌంటెంట్ కార్యాలయానికి తాళం వేశారని ఆ అధికారం మీకెక్కడిదని బిఆర్ఎస్ కౌన్సిలర్లు చౌదరి చరిత, మద్దెల మాదవి, కొక్కు శ్రీనివాస్‌లు ప్రశ్నించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అవినీతికి పాల్పడితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. అలాకాకుండా తాళం వేయడం చట్టరీత్యా నేరమన్నారు. గత 10 రోజులుగా కార్యాలయానికి తాళం వేయడంతో పనులు ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. మున్సిపల్ కార్యాలయం ఏ ఒక్కరి సొత్తు కాదని వెంటనే తాళం తీసి పనులు జరిగేలా చూడాలని పాలకవర్గానికి హితవు పలికారు. మున్సిపల్‌లో పనిచేస్తున్న మహిళా సిబ్బంది పట్ల అసభ్యకరంగా మాట్లాడడం సరికాదన్నారు. ఇలాంటి వారిపై ఉపేక్షించవద్దని మహిళా కార్మికులకు బిఆర్ఎస్ మద్దతు ఉంటుందన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో డ్రైనేజి వ్యవస్థపై దృష్టి సారించాలన్నారు.

## 'డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నీటి గోస' మూడు రోజులుగా రాని మంచి నీరు 'అధికారుల స్పందన కరువు'



ప్రజాపక్షం/వెల్దుర్తి: మెదక్ జిల్లావెల్దుర్తి మండల కేంద్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించి ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్న పేద కుటుంబాలు గుక్కెడు నీటి కోసం గోస పడుతున్నాయి. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటడంతో పక్కనే ఉన్న హల్దీ వాగు సైతం ఎడారిని తలపిస్తోంది. డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో ఏర్పాటు చేసిన నల్లాలు చుక్క నీరు కూడా రాక మూగబోయాయి.సమస్యను లబ్ధిదారులు పంచాయతీ ఈవో దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ట్యాంకర్ పంపించారు. అయితే వచ్చిన నీళ్ల ఇంటికి ఒకటి రెండు బిందెల చొప్పున మాత్రమే పంచడంతో కుటుంబాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇచ్చి మా కల నెరవేర్చారు. కానీ తాగడానికి గుక్కెడు నీళ్ల కూడా ఇవ్వలేకపోతున్నారు. ఒక్క బిందె నీళ్లు తాగడానికి, వంటకు సరిపోతాయి. మరి స్నానాలు, బట్టలు పిండుకోవడానికి ఎక్కడికి పోవాలి? పిల్లలను స్థానాలకు అదే విధంగా బట్టలతో ఉతకాలి. రోజుల తరబడి మురికి బట్టలతోనే కాలం వెళ్లదీస్తున్నాం అంటూమహిళలుకన్నీటి పర్యంతమయ్యారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో వెంటనే బోరు వేయించి నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని బాధితులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఇల్లు కట్టించి ఇచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదు. నీళ్ల సౌకర్యం లేకపోతే మేము ఎలా బతకాలి..? ప్రస్తుతం ట్యాంకర్ నీళ్ల కోసం ఎండలో గంటల తరబడి క్యూ కడుతున్నాం. వృద్ధుల పరిస్థితి మరీ దారుణం అని కాలనీవాసులు మండిపడ్డారు. మిషన్ భగీరథ పైపులైన్ ఉన్నా చుక్క నీరు రావడం లేదని, ట్యాంకర్లు పంపించి తాత్కాలిక ఉపశమనం కలిగించాలని కోరుతున్నారు. లేనిపక్షంలో ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని కాలనీవాసులు తెలిపారు.

## బట్టి కుంట చెరువు కట్ట మరమ్మతు పనులు ప్రారంభం

ప్రజాపక్షం/అల్లాదుర్గం: గత వర్షాకాల వరద నీటి తాకిడికి బట్టి కుంట చెరువు కు గండి పడింది. తెగిపోయిన చెరువు కట్ట పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో శుక్రవారం మరమ్మత్తు పనులకు శ్రీకారం చుట్టారు. హెచ్‌డిఏఫ్ నిధుల కింద 16 లక్షలు మంజూరు కాగా ఇరిగేషన్ అధికారుల సమక్షంలో పనులు ప్రారంభించారు. గత ఏడాది భారీ వర్షాలకు అల్లాదుర్గం లోని బట్టి కుంట చెరువు గండి పడడంతో చెరువు కింద ప్రాంతం లో పంటలు కొట్టుకుపోయి 100 ఎకరాల వరకు వరి పంటకు నష్టం వాటిల్లింది. అలాగే అల్లాదుర్గం ప్రధాన రహదారిపై నీటి ప్రవాహం ఉండడంతో గ్రామానికి వెళ్లడానికి రాకపోకలు స్తంభించాయి. నీటిపారుదల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంతో గండిపడిన చెరువులకు మోక్షం లభించింది ఈ పనులు ప్రారంభం కావడంతో ఆయకట్ట రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈ ఈ సుబ్బలక్ష్మి, ఏఈ వైష్ణవి, ఇంచార్జ్ ఎంపిడిఓ చంద్రశేఖర్, ఎంపీ ఓ గంగారం టెక్మల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బలరాం, సర్పంచ్ల పురం మండల అధ్యక్షులు నర్సారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుభాష్ రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బాల కిషన్, ఆయా గ్రామాల సర్పంచులు మద్దూరి సొమ్య, శ్రీనివాస్ రెడ్డి, శశిధర్ రెడ్డి, శంకర్ నాయక్, మానే నాయక్, గ్రామ ఉప సర్పంచ్ పాండు, మండల పార్టీ ఉపాధ్యక్షులు సాయిబాబా, నాయకులు సురేష్ గుప్తా, సురేష్ గౌడ్, బేతయ్య, శ్రీశైలం, పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేసిన మాజీ జడ్పీటీసీ

ప్రజాపక్షం/శివ్వంపేట : శివ్వంపేట మండలం చండి గ్రామానికి చెందిన దొంతి బాలమణి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ విషయం గ్రామసర్పంచ్ గైనిబైటి ప్రవీణ్‌గౌడ్ ద్వారా తెలుసుకున్న స్థానిక మాజీ జడ్పీటీసీ పబ్బమహేష్‌గుప్తా వెంటనే రూ. 5వేల ఆర్థిక సహాయాన్ని స్థానిక సర్పంచ్ ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామకమిటి అధ్యక్షులు ముత్యంరెడ్డి, ఉపసర్పంచ్ సౌజన్యనరేష్, వార్డు సభ్యులు సందిల శ్రీనివాస్‌గౌడ్, నర్సింగ్, ఆంజనేయులు, కర్రె వీరేశ్, బంగారుగని వెన్నెలనాగరాజు, నాయకులు ఏనుగు కృష్ణారెడ్డి, ఉప్పరి ప్రభు, ఉన్నారు.

## కార్మికుల పక్షాన పోరాటాలు చేసిన గొప్ప నాయకుడు పర్స సత్యనారాయణ

ప్రజాపక్షం/నర్సాపూర్: కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించి, ప్రజాల పక్షాన అసెంబ్లీ లో మాట్లాడిన గొప్ప నాయకులు పర్స సత్యనారాయణ అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం అన్నారు. శుక్రవారం నర్సాపూర్ ఎల్లంకి కళాశాల లో సీఐటీయూ ముఖ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ, వెంకటసుబ్బమ్మ, వెంకమరాజు నిరుపేద దంపతులకు జన్మించిన పర్స సత్యనారాయణ 19 ఏండ్ల వయసులోనే కార్మికొద్యమంలో అంతర్గత నాయకుడిగా పని చేస్తూ సీఐటీ యూ ఆవిర్భావంలో ముఖ్య పాత్ర పోషించరన్నారు. కార్మికొద్యమంలో క్రియాశీలంగా పనిచేస్తు ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహించారని, అదే సమయం ఎమ్మెల్యే గా గెలిచి ప్రజా గొంతును అసెంబ్లీ లో వినిపించిన గొప్ప నాయకుడు పర్స సత్యనారాయణ అ న్నారు. ఆయన 2015 లో మరణించిన ఆయన పోరాటాలు ఇప్పటికి చరిత్రలో నిలిచిపోయాయని గుర్తు చేసారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు, నాయకులు నర్సింలు, చెంద్రయ్య, రుబ్లీ, సత్యనారాయణ, పెంటయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద మల్లారెడిలో యాక్సిడెంట్ నందిగామ వాసి మృతి

ప్రజాపక్షం/నిజాంపేట్: కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డి శివారులో జరిగిన యాక్సిడెంట్‌లో.. మెదక్ జిల్లా నిజాంపేట్ మండలం నందిగామ గ్రామానికి చెందిన వీరబోయిన కార్తీక్ (25) అను వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం..గతంలొ అక్కడే కూలిపని చేసేవాడు, ఆ పనిని మానేసి అక్కడ ఉన్నటువంటి దుస్తులను తీసుకురావడానికి వెళ్లిన సందర్భంలో ఘటన చోటు చేసుకుందన్నారు. అందరితో కలివిడిగా ఉండే కార్తీక్ మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతునికి కుమార్తె కుమరుడు ఉన్నారు.

## సమన్వయ కమిటీ చైర్మన్‌గా శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/రాయపర్తి:** బిఆర్ఎస్ పార్టీ మండల సమన్వయ కమిటీని మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రకటించారు. కమిటీ చైర్మన్‌గా పరుపాటి శ్రీనివాస్ రెడ్డి, సమన్వయ కమిటీ మెంబర్స్‌గా మునావత్ నర్సింహా నాయక్, జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్ గౌడ్, పూస మధు, కర్ర రవీందర్ రెడ్డి, రామ్‌చందర్, అశ్రఫ్ పాషాలు ఎన్నికయ్యారు.

## ప్రకృతిని ప్రేమిద్దాం

**ప్రజాపక్షం/నెక్కొండ:** ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పిస్తే పర్యావరణ ప్రేమికులు సమాజానికి హృదయపూర్వక సందేశాన్ని అందించారు. చెట్లు, పక్షులు, జంతువులు, నదులు, నేల వంటి ప్రతి ప్రకృతి అణువు జీవ చక్రంలో కీలక భాగమని పేర్కొన్నారు. జీవవైవిధ్యం లేకపోతే మానవ జీవితం కూడా అసాధ్యమని, ప్రకృతిని వినియోగించే హక్కు మనకు ఉన్న దానిని నాశనం చేసే హక్కు లేదని స్పష్టం చేశారు. చెట్ల సంరక్షణ, నీటి పరిరక్షణ, జీవశాసుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ సందర్బంగా జీవ వైవిద్యాన్ని రక్షిద్దాం..భూమిని భవిష్యత్తుకు అందిద్దాం అనే నినాదంతో ప్రకృతిని కాపాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## జీవ వైవిధ్యంతోనే మానవ జాతి మనుగడ సాధ్యం

### నర్సంపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి కిరణ్



**ప్రజాపక్షం/నర్సంపేట:** జీవ వైవిధ్యంతోనే మానవ జాతి మనుగడ సాధ్యమని నర్సంపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి కిరణ్ అన్నారు. నర్సంపేట స్వచ్ఛంధ సంస్థల సమాఖ్య ఆధ్వర్యంలో ప్ర భుత్వ అటవీ క్షేత్రాధికారి కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవికిరణ్, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు జీవ వైవిధ్య పరిరక్షణకు సంబంధించిన వాల్ పోస్టర్లు (గోడ పత్రికలు) ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ జీవ వైవిధ్యం తోనే మానవ జాతి మనుగడ సాధ్యమని, అలాంటి జీవ వైవిధ్య పరిరక్షణ కొరకు సమాజం లోని ప్రతి ఒక్కరు పాటు పడాలని పిలుపు నిచ్చారు. భూమి పై జీవరాశి మనుగడకు వైవి ధ్యం అవసరం ఉన్నందున రోజు రోజుకు పెరుగుతున్న వాతావరణ కాలుష్యం వలన అనేక జీవ రాశులు తమ మనుగడను కోల్పోతున్నాయని, భూమి పై జీవాల మధ్య భేదాన్నే జీవ వైవిధ్యం అంటారన్నారు. పర్యావరణం కాలుష్యం చెందడంతో భూగోళం వేడెక్కి జీవ వైవిధ్యం దెబ్బతిని ఎన్నో జీవ జాతులుఅంతరించిపోతున్నాయన్నారు. ఈకార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు గిరగాని సుదర్శన్ గౌడ్, ఏఎస్ఆర్ సంస్థ నిర్వాహకులు ఎర్రబోయిన రాజశేఖర్, స్వయంకృషి సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్, ప్రతిభ సంస్థ ప్రతినిధి బోయిని వెంకటస్వామి, స్వచ్ఛంధ వాలంటీర్ కాసుల వెంకటాచారి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు సోమ్లానాయక్, ధర్మ, ఫారెస్ట్ సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత

### కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ:** 99 రోజుల "ప్రజా పాలన – ప్రగతి ప్ర ణాళిక"లో భాగంగా శుక్రవారం ఉదయం వడ్డేపల్లి చె రువు కట్ట వద్ద నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పాల్గొన్నారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో, జీడబ్ల్యూఎంసీ అధికారుల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వడ్డేపల్లి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, పర్యాటక శాఖ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, పర్యాటక ప్రాంతాల సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతి పౌరుడు వారంలో కనీసం ఒక రోజు "క్లీన్ అండ్ గ్రీన్" కార్యక్రమాల్లో పాల్గొని నగరాన్ని పరిశుభ్రమైన, హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు కేవలం ప్రభుత్వ బాధ్యతగా భావించకుండా ప్రజలు భాగస్వాములుగా మారాలని సూచించారు. వినియోగించిన వ్యర్థాలను రోడ్లపై వేయకుండా నిర్దేశిత ప్రదేశాల్లో వేయడం ద్వారా పారిశుద్ధ్య కార్మికులకు సహకారం అందించవచ్చని పేర్కొన్నారు.ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించే ప్రాంతాలను పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.పెండింగ్‌లో ఉన్న వడ్డేపల్లి ట్యాంక్‌బండ్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి శివాజీ, జిడబ్లుఎంసి సిహెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, మున్సిపల్ అధికారులు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల వేతనాల పెంపులో పారదర్శకత లేదు

### పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా పెంపు లేదు

### రూ.3 లక్షలుకు పైగా ఉన్న స్కీమ్ వర్కర్‌లను ఏ కేటగిరిలోకి తీసుకొస్తారో స్పష్టత లేదు

### బిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు

**ప్రజాపక్షం/నర్సంపేట:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన వేతనాల పెంపు లో శాస్త్రీయత లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెరగలేదని బిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులుకార్మిక సంఘాలు చేసిన డిమాండ్లను పట్టించుకోకుండా వేతన పెంపుదల కోసం క్యాబినెట్ సబ్ కమిటీ వేశామని, దేశానికి ఆదర్శంగా ఉండేలా శాస్త్రీయ పద్ధతిలో కనీస వేతనాల పెంపుదల చేస్తామని సిఎం ప్రకటించి ఆచరణలో చిత్తశుద్ధి లోపించిందన్నారు. కనీస వేతనాల పెంపుదల సందర్భంగా కరువు భత్యం గురించి ప్రస్తావించకపోవడం దారుణమని, పెరిగిన వేతనాలు నాలుగు కేటగిరీలలో అన్ స్కిల్డ్ వర్కర్లకు రూ. 16000/, సెమీస్కిల్ వర్కర్లకు రూ. 17000/, స్కిల్ వర్కర్లకు రూ. 18500/, హై స్కిల్డ్ వర్కర్లకు రూ. 20000/పెంచినట్లు సిఎం ప్రకటించారు. ఇందులో ఒక్క అన్ స్కిల్డ్ వర్కర్ల తప్ప మిగతా వారికి బేసిక్ కరువు భత్యం కలుపుకొని ఇప్పటికే వస్తున్న జీతానికి, పెరిగిన దానికి పెద్ద తేడా లేదన్నారు. కాంట్రాక్టు లేబర్ జీవో 11 ప్రకారం ఇప్పటికే రాష్ట్రంలో కార్మికులకు 13098 నుంచి 23,683 వరకు వేతనాలు పొందుతున్నారని దీన్ని ఆధారంగా చూస్తే ప్రభుత్వం పెంచింది పెద్దగా ఏమి లేదని విమర్శించారు. జీవో నాలుగులో స్కిల్డ్ కార్మికునికి రూ.19572 ఉండగా సిఎం ప్రకటించిన వేతనం రూ.18,500 మాత్రమేనని గతంతో పోలిస్తే 1072 రూపాయల తగ్గిందని తెలిపారు. బి ఆర్ ఎస్ అధికారంలో ఉండగా కనీస వేతనాల సలహా మండలి బోర్డు అన్ స్కిల్డ్ కార్మికుడికి కనీస వేతనం రూ. 18009లు కరువుభత్యాన్ని ఒక్కొక్క పాయింట్ కు 12 రూపాయలు సిఫార్సు చేశారని గుర్తు చేశారు. దీనితో పాటు 2021 జూన్ 25న బిఆర్‌ఎస్ ప్రభుత్వం 5 జీవోలను జారీ చేసిందని వాటికి కాంగ్రెస్ ప్రభుత్వం గెజిట్ కూడా విడుదల చేయలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్కీం వర్కర్లుగా అంగన్వాడి, ఆశ , ఎన్ఆర్ఈజీఎస్ ,ఎన్ ఆర్ హెచ్ ఎం, సర్వ శిక్ష అభియాన్ కింద 3 లక్షల కు పైన కార్మికులు పనిచేస్తున్నారని, వీరు ఏ కేటగిరి కిందికి వస్తారో స్పష్టత లేదని వేతన సవరణను పునసమక్షించాలని డిమాండ్ చేశారు.

## గౌడ కులస్తుల భూములను వక్స్ బోర్డు భూములుగా ప్రచారం తగదు



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ఉర్సు ఎల్లమ్మ తాళ్ల మం డువా ప్రాంతంలోని భూములన్ని వక్స్‌బోర్డుకు చెందినవని ప్రచారం చేయడం తగదని, లక్షలు వెచ్చించి స్థలాలు కొనుగోలు చేసిన వారు, ఇళ్లు కట్టుకున్న ప్రజలు భయాందోళన చెందుతున్నారని ఉర్సు, కరీమాబాద్ గౌడ సంఘం అధ్యక్షుడు బత్తిని అఖిల్ గౌడ్ తెలిపారు. పోలీస్ కేసులు నమోదు చేస్తారని, నిర్మాణాలు ఆపాలనడంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు వారం, పది రోజులుగా నిద్రపోవడం లేదన్నారు. శుక్రవారం ఉర్సు శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో జరిగిన సమావేశంలో అఖిల్ గౌడ్ మాట్లాడుతూ 1954 నుండి నేటి వరకు ప్రయివేట్ పట్టాదారుల పేరుతో భూములు ఉన్నాయని, ఓఎస్ నెంబర్ 85/2003 కేసులో కేవలం dismissed for default మాత్రమేనని, ఎక్కడ కూడా వక్స్ బోర్డు భూమిగా ప్రకటించలేదని స్పష్టం చేశారు. అసలు దర్గా స్థలం కేవలం 600 గజాలు మాత్రమేనని, ఇందుకు సంబంధించిన దస్తావేజులు ఖిలా వరంగల్ తహసీల్దారు కు సమర్పించడం జరిగిందన్నారు. సుమారు 150 ఏళ్లుగా మా పూర్వీకులు ఇక్కడ తాటి చెట్లు గీసి, కల్లు అమ్మకం చేసి జీవనోపాధి పొందారన్నారు. కొంత మంది ముస్లింలతో రెండు, మూడు దఫాలుగా కాంప్రమైజ్ కావడం జరిగింది. వారికి గౌడ కులం, పట్టాదారుల నుండి డబ్బులు కూడా చెల్లించడం జరిగింది. వరంగల్ జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖాధికారులు సమగ్రమైన విచారణ జరిపించాలని, రెవెన్యూ రికార్డుల్లో ఏ విధంగా ఉందో అదే విధంగా నిజమైన పట్టాదారులకు పూర్తి హక్కులు కల్పించాలని కోరారు. సుమారు 150 నుండి 200 కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గౌడ కులం పెద్దలు నాగపురి అశోక్, మడూరి సుధాకర్, నాగపురి రాజు, కుమారస్వామి, బుజ్జి బాబు, బత్తిని సతీష్, పెద్ద నర్సయ్య, శ్యామ్, రమేష్, గౌడిశాల సత్తిబాబు, పల్లె రవి, గట్టు రమేష్, ప్రవీణ్, బొమ్మగాని కుమారస్వామి, పోశాల మల్లేశం, కాలనీ పెద్దలు పూజారి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదును సక్రమంగా నిర్వహించాలి



### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**ప్రజాపక్షం/రాయపర్తి:** బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదును డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. బిఆర్ఎస్ శ్రేణులు కష్టపడి పనిచేసి సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి మారపెల్లి సుధీర్ కుమార్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు మునావత్ నర్సింహా నాయక్, మాజీ ఎంపిపి జినుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, పాక్స్ చైర్మన్ కుందూరు రామచంద్రరెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి పూస మధు, లేతకుల రంగారెడ్డి, భూక్య సురేందర్ రాథోడ్, తాళ్లపల్లి సంతోష్, ఎలమంచి శ్రీనివాస్ రెడ్డి, గారే నర్సయ్య, ఐత రాంచందర్, గూడెల్లి శ్రీనివాస్, ఐత కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల స్కావెంజర్స్ సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నెక్కొండ:** నర్సంపేట నియోజకవర్గ ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డిని కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏఐటియూసి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటియూసి వరంగల్ జిల్లా అధ్యక్షులు కంది చెన్నకేశవులు మాట్లాడుతూ పాఠశాలల్లో తక్కువ వేతనాలతో పనిచేస్తున్న స్కావెంజర్స్‌కు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెండింగ్ బకాయిల చెల్లింపు వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. స్కావెంజర్స్ సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

## మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

### సర్పంచ్ నర్సింగ రామకృష్ణ

**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** మండలంలోని నెల్లుట్ల గ్రామంలోని గల, ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న హమాలి కూలీలకు, జాతీయ ఉపాధి హామీ, పథకం కూలీలకు, నెల్లుట్ల గ్రామ సర్పంచ్ నర్సింగ రామకృష్ణ ఆధ్వర్యంలో, మజ్జిగ ప్యాకెట్ వారు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, పనిచేసే కూలీలు, ఎండ త్రీవత ఎక్కువ ఉన్నందున, కూలీల అలసట తీర్చేతందుకు, వడదెబ్బ తాకకుండా, చల్లటి మజ్జిగ తాగడం వల్ల, ఎండ తీవ్రతను తట్టుకోవచ్చని వారు అన్నారు. ఎండ తీవ్రత ఉండడం వల్ల, ఎండలో పనిచేయడం, ప్రమాదకరమని, వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని వారు కూలీలకు సూచించారు. పనిచేసే కూలీలు, జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం మన బాధ్యత అని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో, ఉప సర్పంచ్ దామర కావ్య ప్రభాకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి, అనిల్, కొయ్యడ అనిల్ బొజ్జం సునీత పత్తిని వేణు గౌడ్ నల్ల అజయ్ నర్సింగ రమేష్, జగ్గమానంద్, వంగ సతీష్, శోభారాణి, కొర్రముల రమేష్, యాదగిరి, ఫీల్డ్ అసిస్టెంట్ నల్ల శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కారోబార్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## డిసిపి చిత్రంలో ఆకట్టుకున్న విద్యార్థి



ప్రజాపక్షం/జనగామ: జనగామ డిసిపి రాజ మహేంద్రనాయక్ ముఖ చిత్రంతో ఓ విద్యార్థి ఆకట్టుకున్నారు. డిసిపి తన పోలీస్ డ్రెస్‌లో కుర్చీలో కూర్చున్న ఫోటోను అలానే గీసికి శుక్రవారం డిసిపి రాజమహేంద్రనాయక్‌కు అందజేశారు. జనగామలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న సృజన్ అనే విద్యార్థి పెన్సిల్‌తో డిసిపి రాజమహేంద్రనాయక్ చిత్రాన్ని గీశారు. శుక్రవారం డిసిపికి అందజేయగా ఆయన ఆ విద్యార్థిని అభినందించారు. చిత్రలేఖ నందు భవిష్యత్తులోనూ రాణించాలని ప్రోత్సహించారు. తన గురువు కాసాల సంతోష్‌కుమార్‌ను డిసిపి అభినందించా రు.

## ఆల్ హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాపక్షం/జనగామ :ఈ నెల 30న జనగామ జిల్లా కేంద్రంలో జరిగే ఆల్ హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు భూక్య శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం సిఐటియు కా ర్యాలయంలో జరిగిన రాష్ట్ర మహాసభల సన్నాహక సమావేశంలో జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు ఐదు లక్షల మంది హమాలీ కార్మికులు పనిచేస్తున్నారనా ్నరు. వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. జనగామలో జరిగే రాష్ట్ర మహాసభలో పలు నిర్ణయాలు తీసుకుంటామని, హమాలీలు మరణిస్తే 10లక్షల ఎక్స్‌గ్రేషియో, 50 సంవత్సరాలు నిండిన వారికి ఆరు వేల పెన్షన్, సామాజిక భద్రత, ముందు ఉంచనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సు ంచు విజేందర్, నాయకులు చిట్యాల సోమన్న, అన్నె బోయిన రాజు, బైరగోని బాలరాజు, గంగరబోయిన మల్లేష్ రాజ్ కృగాళ్ల వెంకటేష్, భా స్కర్, నరసయ్య పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా చేయాలి

ప్రజాపక్షం/జనగామ :కేంద్ర ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందడం కోసం ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వ్యవసాయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఫార్మర్ రిజిస్ట్రీ, క్రాప్ బుకింగ్, రైతు బీమా పై కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో స మీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణ అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్హులైన ప్రతి రైతుతోనూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. యాప్ రైతు ఫక్షన్ నె ఐదర్ అప్డేట్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు తన ఉన్న భూములకు సంబంధించిన వివరములతో కూడిన సమాచారాన్ని వ్యవసాయ విస్తరణాధికారులకు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికాసోని, ఏడిఏలు, ఏఏఓలు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం రాష్ట్ర కమిటీలో కమలాపూర్ నుండి ముగ్గురికి ఛాన్స్



ప్రజాపక్షం/కమలాపూర్: హన్మకొండలోని వి గ్రాండ్ కన్వెన్షన్ లో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో కమలాపూర్‌కు చెందిన ముగ్గురికి రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పిస్తూ నియామక పత్రాలు అందజేశారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచందర్, పద్మశాలి కుల అభివృద్ధికి, పద్మశాలి సంఘ బలోపేతానికి చేస్తున్న విశేష సేవలను గుర్తించి తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా తవటం రవిందర్, రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీగా సీనియర్ పాత్రికేయులు పులికంటి రాజేందర్, రాష్ట్ర ఈసి మెంబర్ గా బొప్ప శివ శంకర్ ను నియమిస్తూ నియామక పత్రాలను రాష్ట్ర నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన నేతలు మాట్లాడుతూ... గ్రామ స్థాయి నుండి పద్మశాలి సంఘాల డెవలప్ కు, చేనేత కార్మికుల సమస్యల సాధన కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం హన్మకొండ జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం, జిల్లా ప్రధాన కార్యదర్శి దిడ్డి రమేష్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొప్పెరి వెంకట హరికిషన్, మేకల జనార్దన్, రాష్ట్ర, జిల్లా సంఘ నేతలు పాల్గొన్నారు.

## గ్రామ స్థాయి నుంచే పర్యాటక స్పృహ పెంపొందాలి

### హన్మకొండ అడిషనల్ కలెక్టర్ రవి




ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : పర్యాటక అభివృద్ధి ద్వారా సమాజంలోని ఆర్థిక, సాంస్కృతిక రంగాలు బలోపేతం అవుతాయని, గ్రామ స్థాయి నుంచే పర్యాటక స్పృహ పెంపొందించాల్సిన అవసరం ఉందని హన్మకొండ అడిషనల్ కలెక్టర్ రవి పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వ "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా నక్కలగుట్ట హరిత కాకతీయ ప్రాంగణంలో "మన ఊరు – మన పర్యాటకం" పేరిట ప్రత్యేక సదస్సు నిర్వహించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ రవి మాట్లాడుతూ భారతదేశం చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ప్రకృతి సంపదలతో నిండిన గొప్ప పర్యాటక కేంద్రాలకు నిలయమని తెలిపా రు. తెలంగాణ ప్రాంతంలోని గ్రామీణ జీవన శైలి, సంప్రదాయాలు, దేవాలయాలు, చెరువులు, పండుగలు, జానపద కళలు, చేతివృత్తులు పర్యాటక రంగ అభివృద్ధికి విశే ష అవకాశాలను కల్పిస్తున్నాయని అన్నారు.గ్రామాల్లో ఉ న్న సహజ, సాంస్కృతిక వనరులను గుర్తించి అభివృద్ధి చేస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు మహిళా సంఘాలు, కళాకారులు, చేతివృత్తిదారు లు ఆర్థికంగా బలోపేతం అవుతారని పేర్కొన్నారు. ప్రతి గ్రామం తన ప్రత్యేకతను ప్రపంచానికి చాటుతూ పర్యాటక మ్యాప్‌లో స్థానం సంపాదించుకోవాలని సూచించా రు.అనంతరం కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కే. విజయబాబు మాట్లాడుతూ పర్యాటకం కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా సాంస్కృతిక పునరుజ్జీవనానికి వేదిక కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ట్రెజరీ శాఖ శ్రీనివాస్, రిటైర్డ్ ప్రొఫెసర్ కే. విజయబాబు, ప్రొఫెసర్ గడ్డం వెంకన్న, పాములపర్తి మదన్‌మోహన్, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బుజ్జి, జిల్లా పర్యాటక అధికారి శివాజీ, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, హరిత హోటల్ మే నేజర్ అశోక్ రెడ్డి, పర్యాటక శాఖ సిబ్బంది, హరిత హోటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లోడింగ్, అన్‌లోడింగ్‌లో వేగం పెరగాలి

### దళిత ఉద్యమ వైతాలికుడు భాగ్యరెడ్డి వర్మ



ప్రజాపక్షం /జనగామ :ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా లోడింగ్, అన్‌లోడింగ్‌లో వేగం పెరగాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా నిర్వాహకులు, అధికారులను ఆదేశించారు. తెలంగాణ దళిత ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహనీయుడు ప్రముఖ సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ అని కొనియాడారు. శుక్రవారం జనగామ మండలంలోని శామీర్ పేట గ్రామలో ఏర్పాటు చేసిన ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అకస్మికంతా తనిఖీ చేశారు. కలెక్టరేట్‌లో భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు జరిగింది, ఎంత తరలించారు, రవాణ సమస్యలు ఏం ఉన్నాయి అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. సీరియల్ ప్రకారమే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలన్నారు. సరిపడా లేబర్‌ను పెట్టుకొని త్వరగా లోడింగ్, అన్‌లోడింగ్ చేయాలన్నారు. కేంద్ర నిర్వాహకులు ముందు జాగ్రత్తతో కొనుగోళ్లు చేయాలన్నారు.అణగారిన వర్గాలకు జీతితాన్ని త్యాగం చేసిన భాగ్యరెడ్డి వర్మ తెలంగాణ దళిత ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసుకున్న భాగ్యరెడ్డి వర్మ అణగారిన వర్గాలకు తన జీవితాన్ని త్యాగం చేశాడని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. శుక్రవారం భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వయించారు. డిసిపి రాజమహేంద్రనాయక్, అదనపు కలెక్టర్ బెన్హాలోమ్, మున్సిపల్ చైర్ పర్సన్ కడకంచి బాలమణి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు లకావత్ ధన్వంతితో కలిసి భాగ్యరెడ్డి వర్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో సమానత్వం, విద్యా విస్తరణ, మహిళా సాధికారత, అస్పృశ్యత నిర్మూలన కోసం ఆయన నిరంతరం పనిచేశారన్నారు. హైదరాబాద్ సంస్థాన కాలంలో దళిత బాలికల విద్యాభివృద్ధికి పాఠశాలను స్థాపించి, విద్యా చైతన్యానికి పునాదులు వేశారన్నారు. భాగ్యరెడ్డి వర్మ ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీవానకొండయ్య లక్ష్మి నరసింహస్వామి గుట్ట వద్ద మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

### డిసిసి అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి లక్ష్మి నారాయణ



ప్రజాపక్షం/దేవరుప్పుల: శ్రీవానకొండయ్య లక్ష్మి నరసింహస్వామి గుట్ట వద్ద మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి లక్ష్మి నారాయణ అన్నారు. శుక్రవారం గుట్ట వద్ద మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ వారు కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మైనింగ్ పనుల వల్ల ఆ ప్రాంతంలోని పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉండడమే గాకుండా పరిసర గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా గుట్టపై ఉన్న శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవాలయ ఉనికి, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతకు ముప్పు ఏర్పడే పరిస్థితి ఉందన్నారు . మైనింగ్ కార్యకలాపాల వల్ల భూగర్భజలాలు, పంట భూములు, ప్రకృతి వనరులు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. కావున గుట్ట వద్ద మైనింగ్ అనుమతులను వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లకావత్ తండా గ్రామ అధ్యక్షుడు యాకన్న, వార్డు సభ్యులు వెన్నెల సుధాకర్, సర్పంచ్‌లు అనిత చందులాల్, అనిత రవీందర్, నాయకులు భాస్కర్, పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీగా వరూధిని

ప్రజాపక్షం/జఫర్‌గడ్: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీగా వరూధిని, రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా గంగిశెట్టి అనూజలను ఎన్నుకోవడం జరిగింది. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షురాలు రాయపూడి భవాని, రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మి నారాయణ చేతుల మీదుగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగానికి ఆర్గనైజింగ్ సెక్రటరీగా మాదంశెట్టి వరూధిని, రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా అనూజకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పదవులు ఇవ్వడంతో తమ బాధ్యతలు మరింత పెరిగాయన్నారు. రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి సామ్రాజ్య లక్ష్మి , రాష్ట్ర కోశాధికారి శ్రీదేవి, అదనపు కార్యదర్శి శ్రీదేవి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు ప్రమోద్ కుమార్, రీజియన్ చైర్మన్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## కూతురిని విక్రయించిన కేసులో తండ్రి, తల్లి, వివాహం చేసుకున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాపక్షం/జనగామ :కూతురిని 20లక్షలకు అమ్ముకొని బలవంతంగా ఇష్టం లేని వ్యక్తితో పెళ్లి చేసిన కేసులో తల్లి, తండ్రి, పెళ్లి చేసుకున్న వ్యక్తిని పోలీస్‌లు అరెస్ట్ చేశారు. శుక్రవారం జనగామ పోలీస్ స్టేషన్‌లో అరెస్ట్ వివరాలను ఇంచార్జీ ఏసిపి భీమ్‌శర్మ వెల్లడించారు. కక్కెర్ల లహరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తండ్రి క క్కెర్ల రాకేష్‌గౌడ్, తల్లి కక్కెర్ల రేణుక, వివాహం చేసుకున్న వ్యక్తి అ వుల ప్రశాంత్‌రెడ్డిలను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన కక్కెర్ల లహరి జనగామలోని గౌతమి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. లహరి తల్లి చనిపోగా తండ్రి రాకేష్‌గౌడ్ రేణుక అనే మహిళను వివాహం చేసుకున్నాడు. కాగా తండ్రి, సవతి తల్లి ఇద్దరు 20 లక్షల రూపాయలకు పెంబర్తి గ్రామానికి చెందిన ఆవుల ప్రశాంత్‌రెడ్డికి విక్రహించి ఆయనతో వివాహం చేయించారు. వివాహం చేసుకోకుంటు పురుగుల మందు తాగి చస్తామని చెప్పడంతో లహరి తాళి కట్టించుకుంది. ఈ నెల 8వ తేదీన వివాహం జరగగా 21తనను తన తల్లిదండ్రులు ప్ర శాంత్‌రెడ్డికి 20లక్షలు విక్రహించారని, ఆయనకు 42 సంవత్సరాలు ఉంటాయని మహిళా కమిషన్‌ను సంప్రదించింది. ఇదే నెల 21న జనగామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిఐ సత్యనారాయణ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసిపి భీమ్‌శర్మ తెలిపారు. కేసు విచారణ, నిందుతులను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్ఐ భరత్, చెన్నకేశవులు, కానిస్టేబుల్ కరుణాకర్, కృష్ణ, అనిల్‌కుమార్, రమేష్, మధులను ఏసిపి భీమ్ శర్మ అభినందించారు.

## ఇంధన్‌పల్లిలో సమగ్ర ఆరోగ్య శిబిరం

### వైద్యాధికారి డాక్టర్ జి. ఉమాశ్రీ



**ప్రజాపక్షం/ జన్నారం:** జన్నారం మండలంలోని ఇంధన్‌పల్లి గ్రామంలో జనజాతీయ గరిమా ఉత్సవ్, జన భాగిదారి అభియాన్ ఐదవ రోజు సందర్భంగా సమగ్ర ఆరోగ్య అవగాహన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, రోగులను పరిశీలించి తగిన చికిత్స అందించారు. గర్భిణీలకు గర్భధారణ పరీక్షలు, అంటురాని వ్యాధుల నిర్ధారణ, సికిల్ సెల్ వ్యాధి, క్షయ వ్యాధి పరీక్షలు చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న తీవ్రమైన ఎండల నేపథ్యంలో హీట్‌వేవ్, వడదెబ్బ లక్షణాలు, చికిత్స, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసి వేసవిలో ఆరోగ్య పరిరక్షణకు సూచనలు అందించారు. వైద్యాధికారులు డాక్టర్ జి. ఉమాశ్రీ, డాక్టర్ పి. ఆదిత్య బాబు, వైద్య సిబ్బంది కే. పూజ, జి. లక్ష్మి, కె. వసంత, పోచయ్య, ఆశా కార్యకర్తలు ఎం. సుమలత, ఆర్. ఉమ, కె. సునీత, పి. రామదేవి పాల్గొన్నారు.

## పీరీల మసీదు పునర్ నిర్మాణానికి గుంట శ్రీశైలం ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం / మందమర్రి:** మందమర్రి పట్టణంలోని అంగడిబజార్ 21వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న పీరీల మసీదు (ఆశిర్ ఖానా) పునర్ నిర్మాణ ఖర్చుల నిమిత్తం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మంచిర్యాల జిల్లా కుర్మా సంఘం అధ్యక్షులు గుంట శ్రీశైలం ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం మసీదు నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, మసీదు పెద్దమనిషి ఎండీ జమీల్‌కు ఐదు వేల రూపాయల నగదును హస్తగతం చేశారు. ఈ సందర్భంగా గుంట శ్రీశైలం మాట్లాడుతూ మసీదు నిర్మాణానికి తమ వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంకం రాజ్ కుమార్, చేగొండ శంకరయ్య, కత్తి రమేష్ పాల్గొన్నారు.

## న్యాయవాది సత్యగౌడ్‌కు జిల్లా లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా నియామకం

**ప్రజాపక్షం/ జన్నారం:** జన్నారం మండలానికి చెందిన ప్రముఖ న్యాయవాది నాయిని సత్యగౌడ్‌ను లక్సెట్టిపేట కోర్టు లీగల్ ఎయిడ్ కౌన్సిల్గా మంచిర్యాల జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నియమించారు. ఈ నియామకంతో పేద, బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించడంలో ఆయన సేవలు మరింత ఉపయోగపడతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సత్యగౌడ్ నియమితులైన సందర్భంగా పలువురు న్యాయవాదులు, స్నేహితులు, ప్రజాప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## హైటెక్ సిటీ యశోదా హాస్పిటల్స్‌లో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ




**ప్రజాపక్షం/హనుమకొండ:** క్యాన్సర్ చికిత్సా రంగంలో వస్తున్న సాంకేతిక ఆవిష్కరణలు రోగులకు కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయని యశోదా హాస్పిటల్స్ (హైటెక్ సిటీ) నిపుణులు వెల్లడించారు. ముఖ్యంగా రోబోటిక్ సర్జరీ, ఎంఆర్ లినాక్ రేడియేషన్ టెక్నాలజీలు క్యాన్సర్ వైద్యంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాయని పేర్కొన్నారు. శుక్రవారం హన్మకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ రేడియేషన్ ఆంకాలజీ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సునీత, రోబోటిక్ సర్జన్ డాక్టర్ ఇ. రాజేష్ గౌడ్ ఈ అత్యాధునిక చికిత్సా విధానాల వివరాలను వెల్లడించారు. 8 ఎంఎం చిన్న రంధ్రాలతోనే రోబోటిక్ సర్జరీ : గతంలో లాగా పెద్ద కోతలు లేకుండా, కేవలం 8 ఎంఎం చిన్న రంధ్రాల ద్వారా హైడెఫినిషన్ 3డి విజన్, మనిషి చేతి కదలికలను అనుకరించే ప్రిస్టేడ్ ఇన్‌స్ట్రుమెంట్స్ సాయంతో క్లిష్టమైన ఆపరేషన్లను అత్యంత ఖచ్చితత్వంతో చేయవచ్చని డాక్టర్ రాజేష్ గౌడ్ తెలిపారు. మహిళల క్యాన్సర్లు గర్భాశయ, అండాశయ క్యాన్సర్లలో రాడికల్ హిస్టరెక్టమీ వంటి సర్జరీలను సురక్షితంగా చేయవచ్చును. దీనివల్ల గతంలో 4 5 రోజులు ఉండాల్సిన హాస్పిటల్ స్టే, ఇప్పుడు ఖచ్చితంగా 24 గంటలకే పరిమితమైంది. యూరాలజీ, కిడ్నీ క్యాన్సర్లు : ప్రోస్టేట్, బ్లాడర్ క్యాన్సర్లలో నరాలు దెబ్బతినకుండా కాపాడటం ద్వారా రోగి జీవన నాణ్యత మెరుగవుతుంది. కిడ్నీ క్యాన్సర్లలో పూర్తి కిడ్నీ తీసేయకుండా కేవలం ట్యూమర్‌ను మాత్రమే తొలగించే (పార్టీల నేఫ్రేక్టోమి) సదుపాయం లభిస్తుంది. మంచి ప్రయోజనాలతో పాటు తక్కువ నొప్పి, తక్కువ రక్తనష్టం, చిన్న మచ్చలు ఏర్పడటంతో పాటు రోగులు అత్యంత వేగంగా కోలుకుని తమ పనుల్లో చేరిపోవచ్చును. కోలోరెక్టల్ క్యాన్సర్ చికిత్సలో స్మార్ట్ సాంకేతికత కోలోరెక్టల్ (పెద్దపేగు) క్యాన్సర్లలో కూడా ఈ టెక్నాలజీ పెద్ద మార్పు తీసుకొచ్చిందని వైద్యులు తెలిపారు. ట్యూమర్‌ను ఖచ్చితంగా గుర్తించి తొలగించడం వల్ల చాలాసార్లు రోగులకు పర్మనెంట్ కొలోస్టమీ (కృత్రిమ మలద్వారం) అవసరం లేకుండా చేయగలుగుతున్నామని వివరించారు. ఇందులో వాడే "స్మార్ట్ స్టాప్లర్" టెక్నాలజీ ద్వారా పేగు చివరలను (బౌల్ ఎండ్స్) మరింత సురక్షితంగా కలపవచ్చని, దీనివల్ల లీకేజ్ ప్రమాదం తప్పుతుందని పేర్కొన్నారు. అలాగే మెరుగైన నాడుల రక్షణ నేర్వ్ ప్రిజర్వేషన్ వలన యూరినరీ, సెక్సువల్ క్వాలిటీ ఆఫ్ లైఫ్ కూడా బాగుంటుందని వెల్లడించారు. రేడియేషన్ రంగంలో సరికొత్త యుగం ఎంఆర్ లినాక్ వైద్య నిపుణులు డాక్టర్ ఎం. సునీత మాట్లాడుతూ, రేడియేషన్ అనగానే రోగుల్లో ఉండే సైడ్ ఎఫెక్ట్స్ భయాలను దూరం చేసేందుకు దేశంలోనే తొలిసారిగా యశోదా హాస్పిటల్స్ హైటెక్ సిటీలో ఎంఆర్ లినాక్ టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ప్రత్యేకతతో ఒకే మిషన్‌లో ఎమ్మారై స్కాన్, లీనియర్ యాక్సిలేటర్ (లైనాక్ ) కలిసి పనిచేస్తాయి. సాధారణ రేడియేషన్‌లో వచ్చే వాంతులు, అలసట, చర్మ సమస్యలు ఇందులో ఉండవు.తక్కువ కాలంలో చికిత్స: ప్రొస్టేట్, బ్రెయిన్, లంగ్, ప్యాంక్రియాస్ వంటి కష్టమైన క్యాన్సర్లకు కొన్ని సందర్భాల్లో కేవలం 5 రోజుల్లోనే చికిత్స పూర్తవుతుంది. ఈ అత్యాధునిక సాంకేతికతలు క్యాన్సర్ రోగులకు ఆర్థిక, శారీరక, మానసిక ఒత్తిడిని తగ్గించి మెరుగైన ఫలితాలను ఇస్తున్నాయని వైద్యులు తెలిపారు. ఈ మీడియా సమావేశంలో యశోదా హాస్పిటల్స్ హైటెక్ సిటీ టీమ్ లీడర్ సాయి వెంకట, డిప్యూటీ మేనేజర్ విజయ్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సింగరేణి వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ముగింపు

### శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్




**ప్రజాపక్షం / శ్రీరాంపూర్:** సింగరేణి యాజమాన్యం శ్రీరాంపూర్ ఏరియా ఆధ్వర్యంలో ఏప్రిల్ 25 నుంచి మే 20 వరకు నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమం శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలోని సీఈఆర్ క్లబ్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రగతి స్టేడియం, ప్రాణహిత స్టేడియం, మనోరంజన్ సముదాయంలో 25 రోజుల పాటు కొనసాగిన ఈ శిక్షణా శిబిరాల్లో ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్ విభాగాల్లో మొత్తం 110 మంది బాలబాలికలకు ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన చిన్నారులకు జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ చేతుల మీదుగా క్రీడా దుస్తులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో కార్మికుల పిల్లలు సమయాన్ని సద్వినియోగం చేసుకునే లక్ష్యంతో ఈ క్రీడా శిబిరాలను నిర్వహిస్తోందని తెలిపారు. శిక్షణ పొందిన బాలబాలికలు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి సింగరేణి సంస్థకు, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల వినోదం, ఆరోగ్య పరిరక్షణ కోసం సింగరేణి సంస్థ ప్రతి ఏరియాలో పార్కులు, స్టేడియాలు, క్లబ్బులు, స్విమ్మింగ్ పూల్స్, జిమ్‌లు వంటి క్రీడా వసతులను ఏర్పాటు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఓ టు జీఎం ఎన్. సత్యనారాయణ, గుర్తింపు సంఘం నాయకులు చంద్రమోహన్, డీజీఎం పర్సనల్ డాక్టర్ ఎస్. అనిల్ కుమార్, క్రీడల గౌరవ కార్యదర్శి కె. సృజన్ పాల్, స్పోర్ట్స్ సూపర్వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటర్ సకినాల నర్సయ్య, ఇండోర్ కెప్టెన్ టి సురేష్ పాల్గొన్నారు.

## కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

### చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు



**ప్రజాపక్షం/ జన్నారం :** 2026–27 విద్యా సంవత్సరానికి గాను కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో 7.0 సిజిపిఎ ఆపై మార్కులు సాధించిన జిల్లాకు చెందిన ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులు ఈనెల 20వ తేదీ నుండి జూన్ 5వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతి మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు మీసేవ నుండి పొందిన ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, మొబైల్ నెంబర్, ఈమెయిల్ ఐడి, మార్కుల మెమో, ఆధార్ కార్డు, రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు నాలుగో తరగతి నుండి పదో తరగతి వరకు తెలంగాణలోనే చదివి ఉండాలని, ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులైతే బోనఫైడ్ సర్టిఫికెట్ సమర్పించాలని తెలిపారు. సిబిఎస్సి, బిఎఎస్, హెచ్‌పిఎస్ విద్యార్థులు సంబంధిత జిల్లా అధికారి ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం జిల్లా షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్‌గా పరమేశ్వర్ నియామకం



**ప్రజాపక్షం/మావల:** హైదరాబాద్ గాంధీభవన్‌లో శుక్రవారం రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ డిపార్మెంట్ ఆధ్వర్యంలో జిల్లాల వారీగా చైర్మన్ల నియామకాలపై అధికారిక ప్రకటన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్మెంట్ చైర్మన్‌గా కొలేట్కర్ పరమేశ్వర్‌ను అధికారికంగా ప్రకటించారు. ఉస్మానియా విద్యార్థి ఉద్యమ నాయకుడిగా, అంబేద్కర్ వాదిగా, దళిత ఉద్యమాలలో విశేష అనుభవం కలిగిన కొలేట్కర్ పరమేశ్వర్‌కు ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్, ఇతర ముఖ్య నాయకులు పరమేశ్వర్‌కు అభినందనలు తెలియజేస్తూ ఆయన నాయకత్వంలో ఎస్సీ డిపార్మెంట్ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కొలేట్కర్ పరమేశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జిల్లా వ్యాప్తంగా ఎస్సీ వర్గాల హక్కుల సాధనకు, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

## టీబీ ముక్త్ భారత్.. అభియాన్‌పై దేశవ్యాప్త సమీక్ష



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ అర్బన్:** దేశాన్ని క్షయ రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అదనపు కార్యదర్శి, మిషన్ డైరెక్టర్ ఆరాధన పట్నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం న్యూఢిల్లీ నుండి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమ పురోగతి, యాప్ వినియోగంపై నిర్వహించిన దేశవ్యాప్త వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా వైద్య అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిషన్ డైరెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి సమాచారం, పర్యవేక్షణ కోసం ప్రతి ఒక్కరూ ప్లే స్టోర్ నుండి టీబీ ముక్త్ భారత్ అభియాన్ యాప్‌ను డైన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సుమలత పాల్గొన్నారు.

## జన్నారం ప్రభుత్వ.. డిపోలో నేడు కలప వేలం

### అటవీ డివిజనల్ అధికారి రామ్మోహన్

**ప్రజాపక్షం/ జన్నారం:** మంచిర్యాల జిల్లా, కవ్వాల్ టైగర్ రిజర్వ్ సర్కిల్ పరిధిలోని జన్నారం ప్రభుత్వ కలప డిపోలో శనివారం ఉదయం 11 గంటలకు సుమారు 50 క్యూబిక్ మీటర్ల నాన్ బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు అటవీ డివిజనల్ అధికారి రామ్మోహన్, అటవీ క్షేత్ర అధికారి లక్ష్మి నారాయణ తెలిపారు. ఈ వేలం పాటలో కలపతో పాటు నాన్ ఇతర మారుజాతి కలపను కూడా బహిరంగంగా వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. కలప కొనుగోలుదారులు, ప్రైవేటు టింబర్ డిపోల నిర్వాహకులు, కలప సంబంధిత వృత్తిదారులు ఈ బహిరంగ కలప వేలం పాటలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## గుండెపోటుతో రైల్వే హెడ్ కానిస్టేబుల్ మృతి



అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించిన డిఎస్‌పి, ఎస్ఐ

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** గుండెపోటుతో బాసర రైల్వే స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్న జిన్నా జాన్ (55) గురువారం హైదరాబాద్‌లోని యశోధలో మృతి చెందాడు. వారం రోజుల క్రితం ఎండ దెబ్బ తగలడంతో సెలవు తీసుకుని హైదరాబాద్ నుండి యశోధ ఆస్పత్రికి చికిత్స పొందుతూ మృతి చెందగా తీరని లోటని హైదరాబాద్ రైల్వే డీఎస్పీ శ్రీనివాస్ రావు, రైల్వే ఎస్సై సాయిరెడ్డి అన్నారు. శుక్రవారం మోర్తాడ్ మండలం దొంకల్ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో పాల్గొని పోలీసు సిబ్బంది 30 వేలు అంత్యక్రియల నిమిత్తం అందజేశారు. బాసర ఎఎస్సై మహబూబ్, రైల్వే పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థులకు వేసవి సెలవులలో కబడ్డీ శిక్షణ శిబిరం




**ప్రజాపక్షం/ముప్కాల్ :** మండల స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కబడ్డీ వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతున్నట్లు స్పోర్ట్స్ అకాడమీ కోచ్ సాయిలు తెలిపారు. కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ అకాడమీ కోచ్ సాయిలు, వార్డు సభ్యులు చిల్క దినేష్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు రాకేష్, సాయికుమార్ పాల్గొన్నారు.

## ఐకెపి ఆధ్వర్యంలో బాలికల సమావేశం



**ప్రజాపక్షం/ముప్కాల్ :** మండల కేం ద్రంలో శుక్రవారం ఐకెపి ఆధ్వర్యంలో కిశోర బాలికల సమావేశం ఏర్పాటు చేశారు. పోషణ సైబర్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకెపి ఎపియం, సీసీ, వీఓఎలు, కిషోర బాలికల సంఘం పిల్లలు పాల్గొన్నారు.

# మందమర్రి సింగరేణిలో ఉత్పత్తి జోష్

### ఏరియా జనరల్ మేనేజర్‌రాధాకృష్ణ



**ప్రజాపక్షం/మందమర్రి:** సింగరేణి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధన దిశగా మందమర్రి ఏరియాలో కార్యాచరణ మరింత వేగం పుంజుకుంది. సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశాల్లో భాగంగా శుక్రవారం మందమర్రి ఏరియాలోని చారిత్రాత్మక కేకే5 భూగర్భ గనిలో భారీ స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మార్గదర్శకత్వంలో మొదటి, రెండవ, మూడవ షిఫ్ట్‌లకు చెందిన ఉద్యోగులతో ప్రత్యేకంగా జరిగిన ఈ సమావేశాలు ఉత్పత్తి, రక్షణ, నాణ్యత, సంక్షేమ అంశాలపై సుదీర్ఘ చర్చలకు వేదికయ్యాయి. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ క్లిష్ట భూగర్భ పరిస్థితుల్లోనూ నిరంతర బొగ్గు ఉత్పత్తి సాధిస్తూ సంస్థకు కేకే5 గని ప్రధాన ఆర్థిక వనరుగా నిలుస్తోందని కొనియాడారు. రక్షణ ప్రమాణాలకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ, ఆధునిక సాంకేతిక పద్ధతులను సమర్థంగా వినియోగిస్తూ వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించే దిశగా ప్రతి ఉద్యోగి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. వినియోగదారులకు అత్యుత్తమ నాణ్యత గల బొగ్గు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని, భూగర్భంలో బొగ్గు వెలికితీసే ప్రతి దశలోనూ నాణ్యత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. కేకే5 గని నుంచి ఉత్పత్తి అవుతున్న బొగ్గుకు మార్కెట్లో ప్రత్యేక డిమాండ్ ఉందని, ఆ విశ్వసనీయతను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం జి.ఎల్. ప్రసాద్, ఐఐటియుసి మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, డీజీఎం పర్సనల్ సీహెచ్ అశోక్, డీజీఎం ఐఈడీ కిరణ్ కుమార్, క్వాలిటీ ఇంచార్జ్ ప్రదీప్, ఐటీడీ వై మేనేజర్ రవి, కేకే5 గని మేనేజర్ శంభునాథ్ పాండే, డిప్యూటీ మేనేజర్ జశ్వంత్, ఐఈడీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్యామ్, సంక్షేమ అధికారిణి రవళి పాల్గొన్నారు.

## కొత్త పింఛన్లపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి

### బిసి సంక్షేమ సంఘం డిమాండ్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జూన్ 2 నుండి రాష్ట్రంలోని వికలాంగులకు, వితంతువులకు, వృద్ధులకు నూతన పెన్షన్లను అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని, అయితే దీనికి సంబంధించిన విధి విధానాలపై త్వరలోనే జరగనున్న రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేయాలని నిర్మల్ జిల్లా బీసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా పాత పెన్షన్ల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్ (ఎఫ్ఆర్ఎస్ ఫేస్ రికగ్నిషన్) కేంద్రాలకు కొత్త పింఛన్ల ఆశావహులు వెళ్తుండగా, ప్రభుత్వం నుండి తమకు ఏలాంటి ఆదేశాలు రాలేదని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల ప్రజల్లో గందరగోళం నెలకొందని, తక్షణమే, ప్రభుత్వం కొత్త పింఛన్లపై స్పష్టమైన ప్రకటన చేసి ఈ అయోమయానికి ముగింపు పలకాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా నిర్మల్ జిల్లాలో 60 శాతానికి పైగా బిసి జనాభా ఉన్నందున, అర్హులైన బీసి జాతికి చెందిన వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు అందరకీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బిసి సంక్షేమ సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు మర్కంటి జీవన్, జిల్లా కో కన్వీనర్ కొత్తూరు కిషన్, సంఘం నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వడ్యాల్‌లో దీపను స్తంభంపై ప్రాచీన శిలాశాసనం గుర్తింపు



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా కేంద్రానికి సమీపంలోని వడ్యాల్ గ్రామంలో అరుదైన ప్రాచీన శిలాశాసనాలను గుర్తించినట్లు ప్రముఖ చరిత్ర పరిశోధకుడు డాక్టర్ తుమ్మల దేవరావు తెలిపారు. గ్రామానికి పశ్చిమ దిక్కున ఉన్న ఒక పొలంలోని హనుమాన్ ఆలయ సమీపంలో, నాలుగు అడుగుల ఎత్తైన దీపపు స్తంభంపై చెక్కబడిన దాన శాసనాన్ని మరో రెండు లఘు శబూసనాలను వారు పరిశీలించారు. ఇసుకరాయిపై చెక్కబడిన ఈ శాసనం కొంత అస్పష్టంగా మారినప్పటికీ లిపి శైలి ఆధారంగా ఇది 11వ శతాబ్దం నుండి 15వ శతాబ్దం మధ్యకాలానికి చెందిన మధ్యయుగపు తెలుగుకన్నడ దాన శాసనంగా గుర్తించారు. శాసనం ప్రారంభంలో స్వస్తి శ్రీ అనే అక్షరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, పూర్వకాలంలో బాటసారులు, గ్రామస్థుల వెలుతురు కోసం ఏరాపటు చేసిన దీపపు స్తంబంపై దీనిని చెక్కారని ఆయన వివరించారు. దీనితో పాటు దేవనాగరి లిపిని పోలి ఉన్న మరో అస్పష్ట శాసనాన్ని ఒక లఘు శాసనాన్ని కూడా ఇక్కడ గుర్తించారు. ఈ మూడు శాసనాలు కళ్యాణి చాళుక్యుల కాలం నుండి కాకతీయుల మధ్యయుగ కాలానికి చెందినవిగా భావిస్తున్నారు. నిర్మల్ జిల్లాలో ఇప్పటివరకు మొత్త 18 శాసనాలను వెలుగులోకి తీసుకువచ్చామని, ఇవి జిల్లా ప్రాచీన సంస్కృతికి, నాగరికతకు నిదర్శనాలని డాక్టర్ తు మ్మల దేవరావు పేర్కొన్నారు. ఈ క్షేత్ర పర్యటనలో ఆయనతో పాటు అబ్బడి రాజేశ్వర్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

## మధ్యం మత్తులో వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరు యువకులు అరెస్ట్

**ప్రజాపక్షం/భైంసా :** మద్యం మత్తులో వ్యక్తిపై దాడీ చేసిన ఇద్దరు యువకులు అరెస్ట్ , రిమాండ్‌కు తరలింపు తేది 21.05.2026 న దహేగాం గ్రామంలోని కల్లు బట్టి సమీపంలో గంగాదరిల్ల నారాయణ అదే గ్రామానికి చెందిన సొట్ల పోతన్న మధ్య మాటామాటా పెరిగి గొడవ జరిగింది. ఈ గొడవ అనంతరం నారాయణ తన కుమారుడు గంగాదరిల్ల రాజేందర్‌కు విషయం తెలియజేయగా, రాజేందర్ తన స్నేహితుడు వాగ్మారే ప్రేం తో కలిసి కల్లు బట్టి వద్దకు వెళ్లారు. అనంతరం మద్యం మత్తులో ఉన్న గంగాదరిల్ల రాజేందర్ వాగ్మారే ప్రేమ కర్రలతో సొట్ల పోతన్నపై దాడి చేసి గాయపరిచారు. బాదితుడి పిర్యాదు మేరకు కేసు నమేదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది. దర్యాప్తలో భాగంగా నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా దాడికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో ఈ రోజు వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, వ్యక్తిగత విబేదాలు లేదా చిన్నపాటి గొడవల పేరుతో హింసాత్మక దాడులకు పాల్పడే వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని నేరాలకు పాల్పడిన వారు తప్పకుండా శిక్షించబడతారని హెచ్చరించారు.

## బిఆర్‌ఎస్‌లో చేరిన గజేందర్ యాదవ్



కండువా కప్పి ఆహ్వానించిన కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ పదవికి నిర్మల్‌కు చెందిన అప్క గజేందర్ యాదవ్ రాజీనామా చేశారు. అనంతరం ఆయన బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర సేనా పార్టీలో చేరారు. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లాలోపార్టీ బలోపేతానికి సాయశక్తులా కృషి చేయాలని ఆమె గజేందర్ యాదవ్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టపగలు ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్



**ప్రజాపక్షం/భైంసా/నిర్మల్ :** భైంసా మండలం దేగాం గ్రామంలో 06.05.2026 రోజున దహేగాం గ్రామానికి చెందిన దావుల మయూరి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు తలుపు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి, సుమారు 3 మాసాల బంగారం, నగదు రూ. 1500 దొంగతనం చేసినట్లు ఫిర్యాదు అందగా కేసు నమోదు చేయబడింది. ఈ కేసులో దర్యాప్తు చేపట్టి ఈ రోజు అదే గ్రామానికి చెందిన పిట్ల పోశెట్టి తండ్రి ముత్తన్న అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా, తానే ఈ దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. అనంతరం నిందితునిడిని అరెస్ చేసి రిమాండ్‌కు తరలించడం జరిగింది. ఈ కేసులో భాగంగా రూ. 4000 విలువైన సొత్తును రికవరీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అదనపు ఎస్పీ మాట్లాడుతూ, ఇటువంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకొని చట్టప్రకారం శిక్షస్తామని హెచ్చరించారు.

## శాంతియుత నిరవదిక సమ్మె

**ప్రజాపక్షం/కుంటాల :** న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తహసిల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని వి.ఓ.ఏ.లు శాంతియుత నివదిక సమ్మె చేపట్టారు. కనీస వేతనం 26 వేలు, భీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## 24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ 2వ స్పెల్ మూల్యాంకనం

### అధ్యాపకులను రిలీవ్ చేయకుంటే చర్యలు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఈనెల 24 నుండి ఇంటర్ సప్లమెంటరీ 2వ స్పెల్ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభం కానుందని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, ఎకనామిక్స్, కెమిస్ట్రీ, కామర్స్ సబ్జెక్టుల అధ్యాపకులందరూ 24న ఇంటర్ మూల్యాంకనం జిల్లా కేంద్రంలో రిపోర్టు చేయాలన్నారు. ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ అన్ని రెసిడెన్సియల్ జూనియర్ కళాశాలల లాగిన్లలో అధ్యాపకుల అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇంటర్ బోర్డు నిక్షిప్తంగా చేసిందని, మూల్యాంకన విధులలో పాల్గొనే అధ్యాపకులను 23న రిలీవ్ చేయాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. ప్రైవేట్ యాజమాన్యం అధ్యాపకులను రిలీవ్ చేసినట్లయితే ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్ విద్యాధికారి స్పష్టం చేశారు.